పత్రికా ప్రకటన - 3

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 14.07.2014

తెలంగాణ రాష్ట్రంలో అవలంభించే వ్యవసాయ విధానానికి స్వామినాథన్ సిఫారసులు స్ఫూర్తిగా తీసుకుంటామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు చెప్పారు. తాను ప్రతిపక్షంలో వుండగా స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాల్సిందిగా అధికార పక్షాన్ని అనేక పర్యాయాలు డిమాండ్ చేశానని, ఇప్పుడు ఆ సిఫారసులు అమలు చేసే అవకాశం తనకు దక్కిందని కేసిఆర్ అన్నారు. భారతదేశ హరిత విప్లవ పితామహుడు ఎంఎస్. స్వామినాథన్ సోమవారం సచివాలయంలో కేసిఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో వ్యవసాయ విధానంపై చర్చ జరిగింది. విత్తనోత్పత్తికి అనుగుణమైన నేలలు తెలంగాణలో వున్నాయని, వీటికి తోడు ఇక్రిసాట్ కూడా అందుబాటులో వుందని వీటిని ఉపయోగించుకొని తెలంగాణలో విత్తనోత్పత్తిని పోత్సాహించాలని స్వామినాథన్ చెప్పారు. తాము తెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశ విత్తన భాండాగారంగా మార్చాలనుకుంటున్నామని, ప్రాంతాల వారిగా నేలలను పరీక్షించి దానికనుగుణంగా విత్తనాలను ఉత్పత్తి చేయనున్నామని కేసిఆర్ స్వామినాథన్‌కు వివరించారు. విత్తనోత్పత్తి పద్ధతులను వివరించడానికి ఓ సదస్సు నిర్వహిస్తామని అందులో ప్రధానోపన్యాసం చేయాల్సిందిగా స్వామినాథన్‌ను ముఖ్యమంత్రి కోరారు. వ్యవసాయం పూర్తిగా సాంప్రదాయబద్ధంగా సాగుతోందని, దీనికి కొత్త పుంతలు తొక్కించాలని స్వామినాథన్ వివరించారు. యువకులు, పట్టణ వాసులు కూడా వ్యవసాయానికి ఆకర్షితులయ్యేలా ఈ రంగాన్ని ఆర్థికంగా, సాంకేతికంగా అభివృద్ధి చేయాలని స్వామినాథన్ చెప్పారు. కరువు పీడిత ప్రాంతాలలో అనుసరించాల్సిన వ్యవసాయ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటలు తదితర అంశాలపై ఇద్దరి మధ్య చర్చ జరిగింది. వ్యవసాయ రంగాన్ని గ్రామీణ ఉపాధి హామి పథకంతో అనుసంధానం చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని కేసిఆర్ చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు ఉపయోగపడే వ్యవసాయ పద్ధతులు అవలంభిస్తామని, మహిళలు ఎక్కువగా వ్యవసాయ కార్యక్రమాలలో పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తామని కేసిఆర్ చెప్పారు.

వ్యవసాయ రంగాన్ని కేవలం ఆహారోత్పత్తికి సంబంధించిన శాఖగా మాత్రమే కాకుండా దేశానికే వెన్నుముకగా నిలిచే రంగంగా చూస్తామని కేసిఆర్ చెప్పారు. తెలంగాణలో ఇక్కడి నేల స్వభావం, వాతావరణ పరిస్థితులు, వర్షపాతం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని ఓ దీర్ఘకాలిక వ్యవసాయ విధానాన్ని రూపొందించుకొంటున్నట్లు కేసిఆర్ వెల్లడించారు. గ్రామీణులను చైతన్యవంతులను చేయడం ద్వారా ఎక్కువ ఫలితాలు వుంటాయని, కరువు పీడిత ప్రాంతాలలో తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వ నిర్ణయాలు వుంటాయని సిఎం చెప్పారు. తాను ఎన్నో ఏళ్లుగా వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడం కోసం కృషి చేస్తున్నానని, తెలంగాణ రాష్ట్రంలో మెరుగైన వ్యవసాయ పద్దతులు అవలంభిస్తారనే నమ్మకం వుందని స్వామినాథన్ వ్యక్త పరిచారు.

స్వామినాథన్ పట్ల గౌరవం చాటుకున్న కేసిఆర్.

హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్ పట్ల కేసిఆర్ తన గౌరవాన్ని, అభిమానాన్ని చాటుకున్నారు. సచివాలయానికి వచ్చిన స్వామినాథన్‌ను తన ఛాంబర్ లోకి సాదరంగా ఆహ్వానించారు. స్వామినాథన్ పలు సందర్భాలలో చెప్పిన మాటలు, సూచనలను తాను పాటించానని, ఆయన చేసిన సిఫారసులను అమలు చేయాలని పోరాడానని కేసిఆర్ గుర్తు చేశారు. దాదాపు 90 సంవత్సరాల వయస్సు వున్న స్వామినాథన్ వీల్ చైర్ లో సిఎం ఛాంబర్‌కు వచ్చారు. తిరిగి వెళ్లేటప్పుడు కేసిఆర్ స్వయంగా స్వామినాథన్ వీల్ చైర్ నెట్టుకుంటూ లిఫ్టు దాకా వెళ్లి వీడ్కోలు పలికారు. చెన్నై లోని స్వామినాథన్ ఫౌండేషన్ తప్పక సందర్శిస్తానని సిఎం చెప్పారు. 90 ఏళ్ల వయస్సులోను దేశానికి మేలు చేయాలనే స్వామినాథన్ తపన అందరికి ఆదర్శ ప్రాయమన్నారు.

---

**సిపిఆర్ఓ టు సిఎం**